

బెంబేలెత్తిస్తున్న శునకాలు

- రహదారులపై గుంపులుగా సంచారం
- ద్విచక్ర వాహనాల వెంటపడి దాడులు
- గాయాలతో ఆసుపత్రిపాలవుతున్న ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

8లో





ఇచ్ఛాపురంలో పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

డబ్బు ఆశచూపి.. స్మగ్లింగ్‌లోకి దించి

- గంజాయి రవాణా కోసం విద్యార్థులు, మహిళల వినియోగం
- రోడ్డు, రైళ్ల మార్గాల ద్వారా సరుకు తరలింపు
- పోలీసులకు పట్టుబడుతున్న వైనం
- తప్పించుకుంటున్న వ్యాపారులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, మహిళలు గంజాయి స్మగ్లర్ల వలలో చిక్కుకుంటున్నారు. పేదరికం, కుటుంబ అవసరాలు, వ్యసనాలు వంటివి ఆసరాగా చేసుకొని వారిని గంజాయి దందా కోసం వ్యాపారులు వినియోగించుకుంటున్నారు. డబ్బు ఆశచూపి స్మగ్లింగ్‌లోకి దించుతున్నారు. పోలీసుల తనిఖీల్లో వీరు పట్టుబడుతుండగా, వ్యాపారులు మాత్రం తప్పించుకుంటున్నారు. మైనర్లు అసాంఘిక (మిగతా 6వ పేజీలో..)

- ఈ నెల 22న ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో అజయ్ మునుస్వామి అనే 19 ఏళ్ల యువకుడు గంజాయితో పట్టుబడ్డాడు. ఈయనది తమిళనాడు. గ్రౌండ్‌లో ఆడుతుండగా గంజాయి వ్యాపారి విక్కీతో పరిచయం ఏర్పడింది. విక్కీ అధిక డబ్బులు ఆశచూపి మునుస్వామిని గంజాయి రవాణా ముగ్గులోకి దించాడు. విక్కీతో కలిసి గంజాయి తరలిస్తుండగా ఇచ్ఛాపురం పోలీసులకు పట్టుబడ్డాడు.
- ఈ ఏడాది మే 31న మడపాం టోల్‌ప్లాజా వద్ద ఓ మహిళ గంజాయితో పట్టుబడింది. పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వాహనం నుంచి దిగిన కటక్‌కు చెందిన రత్నకర్ జిన్ని బ్యాగుతో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. పర్లాకిమిడికి చెందిన ట్రావెలర్ ముక్తిపరిషా వద్ద గంజాయిని పట్టుకొని పోలీసులు అరెస్టు చేశారు.



గంజాయి నిందితులతో పోలీసులు (ఫైల్)

- జూలై 15న పలాస రైల్వే స్టేషన్‌లో గంజాయితో ముగ్గురు మహిళలు పట్టుబడ్డారు. వీరంతా బిహార్‌లోని హోటల్‌లో కూలీ లుగా పనిచేస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఇస్తే రూ.5 వేలు వంతున ఇస్తామని ఆశచూపారు వ్యాపారులు. దీంతో ఒడిశా నుంచి పలాస మీదుగా బిహార్‌కు గంజాయి తరలిస్తుం డగా పోలీసులకు దొరికిపోయారు.

డేంజర్.. డేంజర్!

- ప్రమాదకరంగా విద్యుత్ కేబుల్ వ్యవస్థ
- రిమ్స్‌లో తరచూ షార్ట్ సర్క్యూట్
- తాత్కాలిక మరమ్మతులతోనే సరి
- రోగులకు తప్పని ఇబ్బందులు



శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి



షార్ట్ సర్క్యూట్‌కు గురైన కేబుల్ వైర్లు (ఫైల్)

శ్రీకాకుళం రిమ్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో విద్యుత్ కేబుల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చాలా సంవత్సరాల కిందట వేసిన అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. తరచూ షార్ట్ సర్క్యూట్ సంభవించి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొద్ది నెలల కిందట పిడియాట్రిక్ వార్డులో విద్యుత్ ప్రమాదం జరిగింది. అయితే, ఎటువంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఎమర్జెన్సీ (మిగతా 6వ పేజీలో..)

- ఈ నెల 4న శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆసుపత్రి మొత్తం 15 నిమిషాల పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. అదే సమయంలో ఆసుపత్రికి సంబంధించిన జనరేటర్ కూడా పనిచేయ లేదు. దీంతో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నాగావళిలో బయోమెడికల్

- నదిలో ప్రైవేటు ఆస్పత్రుల వ్యర్థాలు
- ఇటీవల కలెక్టర్ పరిశీలన.. చర్యలకు ఆదేశం
- నోటీసులిచ్చేందుకు అధికారుల సన్నద్ధం



నాగావళి తీరంలో వ్యర్థాలు



బయోమెడికల్ వ్యర్థాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నాగావళి నది.. వ్యర్థాలతో కలుషితమవుతోంది. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా బయోమెడికల్ వ్యర్థాలు పారబోస్తున్నారు. ప్రజలు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ.. నదిలో చెత్త పడేస్తున్నారు. శ్రీకాకుళంలో పేరుమోసిన ఆస్పత్రులు, సాధారణ క్లీనిక్‌లు సుమారు 70కు పైగా ఉన్నాయి. ఆసుపత్రి నిర్వహణలో రోజుకు టన్ను వరకు చెత్త లభ్యమవుతుంది. కానీ అలా లభ్యమవుతున్న బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనలు మేరకు తరలించడం లేదు. వాటిని నాగావళి నదిలో విడిచిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. అలాగే కొత్త బ్రిడ్జి, గుజరాతీపేట, బలగమెట్టు, ఏడురోడ్ల జంక్షన్, కలెక్టర్ ఆఫీస్, డీసీసీబీ కాలనీ.. ఇలా అన్నిచోట్ల వ్యర్థాలు కనిపిస్తున్నాయి. వీటికితోడు నగరంలోని చికెన్, మటన్, దుకాణాలు, హోటళ్ల వద్ద వ్యర్థాలను సైతం నదిలో పారబోస్తున్నారు. దీంతో నది పూర్తిగా కలుషితం అవుతోంది. బయోమెడికల్ వ్యర్థాల్లో చాలారకమైన బ్యాక్టీరియా, వైరస్ రోగ కారకాలు వ్యాపించి చాలామంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

కచ్చితంగా ఇలా చేయాల్సిందే..

ఆస్పత్రుల్లో సాధారణంగా వ్యాధి నిర్ధారణ, చికిత్సలో దూది, సూది, సిరంజీ వంటివి ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఒకసారి వాడిన తర్వాత ఇవి వ్యర్థాల జాబితాలో చేరుతాయి. వైద్య ఆరోగ్య పరిభాషలో వాటిని జీవవైద్య వ్యర్థాలుగా (మిగతా 6వ పేజీలో..)

ఐబీఎం క్వాంటమ్ ఫెస్ట్‌కు ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎంపిక



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ తదితరులు

ఎచ్చెర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐబీఎం క్వాంటమ్ క్విస్కిట్ పాల్ ఫెస్ట్-2025కు ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎంపికైంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఫెస్ట్ నిర్వహణకు 55 విశ్వ విద్యాలయాలను మాత్రమే ఎంపిక చేశారు. రాష్ట్ర నుంచి ఏకైక సంస్థగా ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎంపిక కావడం విశేషం. ఈ క్యాంపస్ విద్యార్థులు కాటం నిఖిల్‌తేజ, కాసిం వాలి దూదేకుల, ప్రవీణ్‌కుమార్ చెరుకూరి, జాన్‌బాబు చదువుల, గుణశ్రీ కిమిడి ఇచ్చిన ప్రజెంటేషన్ కారణంగా ఫెస్ట్‌కు ఎంపికైంది. ఈ ఫెస్ట్‌ను ఈ నెల 21 నుంచి 27వరకు ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీలో జరగనుంది. ఇందులో దేశ వ్యాప్తంగా విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా పాల్గొనున్నారు. క్వాంటం కంప్యూటింగ్ అభివృద్ధి, ఈ రంగంలో ఉన్న అవకాశాలపై వర్క్‌షాపులు, నిపుణుల ఉపన్యాసాలు కూడా ఉంటాయి. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా అకడమిక్స్ డీన్ శివరామకృష్ణ వ్యవహరించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ సీహెచ్.వాసు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ జి.రవి, డిప్యూటీ ఏవో నూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం.. చక్కగా చదువుకోండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- కంచిలి గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ
- వివిధ పనులకు అక్కడికక్కడే రూ.8లక్షలు మంజూరు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కంచిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పరంగా పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.. మీరంతా చక్కగా చదువుకోండి' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కంచిలి గురుకుల పాఠశాల విద్యార్థులకు సూచించారు. బుధవారం సాయంత్రం గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధన, మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జాతీయ స్థాయి వాలీబాల్ ప్లేయర్లు ఉన్నారని తెలుసుకున్న ఆయన వారితో కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. డార్మిటరీ భవనం, వంటశాల, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. డార్మిటరీలో విద్యుత్, ఇతర పనులకు సంబంధించి రూ.5లక్షలు, ఆధునిక వాలీబాల్‌కోర్టు నిర్మాణానికి రూ.80 వేలు, కొత్తగా బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణం, క్రికెట్ కిట్, ఇండోర్ ఆటల కోసం రూ.2లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్యం నిర్వహణ కోసం మరో రూ.20 వేలు కలిపి మొత్తం రూ.8లక్షలు మంజూరు చేశారు. ఐఐటీ, నీట్ (మిగతా 6వ పేజీలో..)

జేఎన్టీయూ(జీవీ) వీసీగా సుబ్బారావు



నూతన వీసీ ప్రొఫెసర్ సుబ్బారావు

జేఎన్టీయూకే, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం (జేఎన్టీయూజీవీ) నూతన ఉప కులపతిగా కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ విస్సాకోడేటి వెంకట సుబ్బారావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ బుధవారం జీవో జారీ చేసింది. ఈయన ప్రస్తుతం కాకినాడ జేఎన్టీయూ రెక్టార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఫారిన్ యూనివర్సిటీ రిలేషన్స్ డైరెక్టర్‌గా, ఏపీపీజీఈసెట్ కో-కన్వీనర్‌గా, ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో, విద్యోన్నతి పథక కన్వీనర్‌గా, యూసీఈఎన్ ప్రిన్సిపాల్‌గా, జేఎన్టీయూకే రిజిస్ట్రార్‌గా, ఏపీఈఏపీసెట్-2025 కన్వీనర్‌గా వ్యవహరించారు. సుబ్బారావు ఉప కులపతి పదవిలో మూడేళ్లు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సుబ్బారావును జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

పసిడి పరుగులు

- పది గ్రాములు రూ.1.24లక్షలు
- 2020లో రూ.40వేలు
- ఐదేళ్లలో మూడింతలు పెరిగిన ధర
- పోటీ పడుతున్న వెండి

బంగారం ధరలు ఇలా


సంవత్సరం	పదిగ్రాములు
1910	రూ.15.50
1920	రూ.18.25
1930	రూ.18.05
1940	రూ.36
1950	రూ.99
1960	రూ.111.56
1970	రూ.184.50
1980	రూ.1,330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.40,000
2024	రూ.80,000
2025	రూ. 1,24,000



నరసన్నపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పసిడి ధర పరుగులు పెడుతోంది. రోజురోజుకూ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రస్తుతం పదిగ్రాముల (24 క్యారెట్లు) బంగారం రూ.లక్షా 24వేలు దాటి ఆల్‌టైం రికార్డు సృష్టించింది. 2020లో పది గ్రాముల ధర రూ.40వేలు ఉండగా ప్రస్తుతం మూడురెట్లు పెరిగింది. తులం రూ.1.50లక్షలుదాటడం ఇదే మొదటిసారి అని వ్యాపారులు అంటున్నారు. జిల్లాలో 450 పైగా బంగారు దుకాణాలు ఉన్నాయి. నరసన్నపేట, శ్రీకాకుళంలోనే 200పైగా దుకాణాలు ఉండగా, కాశీబుగ్గ, టెక్కలి, సోంపేట, ఆమదాలవలస, బ్రాహ్మణతర్లలో మరో 250 వరకు షాపులు ఉన్నాయి. నరసన్నపేట బులియన్ మార్కెట్ పసిడికి పెట్టిందిపేరు. ఇక్కడ నిత్యం కోట్ల రూపాయల్లో వ్యాపారం జరుగుతుంటుంది. జిల్లాలో ప్రతిరోజూ రూ.6కోట్లకు పైగా వ్యాపారం సాగుతుంది. ధరలు పెరుగుతుండడంతో వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. బంగారం బాటలో వెండి ధరలు కూడా పయనిస్తున్నాయి. కిలో వెండి రూ.1.60లక్షలకు చేరింది. ఏడాది కిందట కిలో వెండి రూ.80వేలు ఉండగా, ఇప్పుడు 50శాతం మేర (మిగతా 6వ పేజీలో..)

రహదారులకు మహర్దశ

- జిల్లాలో స్టేట్ హైవేల అభివృద్ధికి రూ.31.73 కోట్లు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



శ్రీకాకుళం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాష్ట్రీయ రహదారులకు మహర్దశ పట్టింది. తొమ్మిది రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.31.73 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజాం-రణస్థలం రోడ్డు (స్టేట్ హైవే-122) 12 కిలోమీటర్లకు గాను రూ.4కోట్లు, మెళియాపుట్టి-పాతపట్నం రహదారి(ఎస్‌హెచ్-93) 12.6 కిలోమీటర్లకు రూ.3.40 కోట్లు, గార-చింతాడ రహదారి (ఎస్‌హెచ్-125) 2.4 కిలోమీటర్ల విస్తరణకు రూ.3.50 కోట్లు, సోంపేట-కవిటి-ఈదుపురం రహదారి(ఎస్‌హెచ్ - 81) 10.6 కి.మీ రూ. 4.10 కోట్లు, బద్రి-సారవకోట, తెంబూరు-హిరమండలం (మిగతా 6వ పేజీలో..)

మెరుగైన వైద్యం అందిస్తాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పిడుగుపాటు బాధితులకు ఎస్పీతో కలిసి పరామర్శ

6లో

బతుకుదెరువు కోసం వెళ్లి..

- దుబాయ్‌లో జిల్లా యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి
- పాలవలసలో విషాదం

8లో

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వద్దు

- మాజీ మంత్రి వర్దే శోభనాద్రీశ్వరరావు

8లో

పూర్వ వైభవానికి సాక్ష్యంగా..!



మందస రాజకోట



రాణి కోట



ఆయుధాలు శుభ్రం చేసే రాణి కొలను

హరిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మందస రాజకోట గత వైభవానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రతిదసరా వేడుక సమయంలో ఏళ్ల కిందట అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. ఆయుధ రాజా శ్రీనివాసమణి పాలన సమయంలో 14వ శతాబ్దంలో ఈ వేడుకలు మందస రాణీ కోట.. రాజావారి కోట మధ్యభాగంలో ఘనంగా నిర్వహించేవారు. ఇక్కడి రాణీ కొలనులో ఆయుధాలను శుభ్రం చేసి అనంతరం కిల్లమ్మ అమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి.. పూజలు చేసేవారు. పూజా సమయంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నైవేద్యంతోపాటు ఆహార పానీయాలు అందించేవారని ఇక్కడి వారు కథలుగా చెబుతుంటారు. కాలక్రమేణా రాజ్యాలు పోయాయి. రాజులు కనుమరుగయ్యారు. నాటి రాజసానికి నిలువెత్తు సాక్ష్యంగా రాజసౌధాలు నిలుస్తున్నాయి. ఆయుధ బాండాగారం శిథిలావస్థకు చేరుకోగా.. కోటలు మాత్రం నేటికీ నాటి రాజసం చిందిస్తూనే ఉన్నాయి. రాజ వంశీకులు నాటి సంప్రదాయాలను కొనసాగిస్తూ.. స్థానికులకు చేయూతనందించేలా చూడాలనేది ఈ ప్రాంతీయుల ఆకాంక్ష.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

మెరుగైన వైద్యం అందిస్తాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పిడుగుపాటు బాధితులకు ఎస్పీతో కలిసి పరామర్శ

టెక్కలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మెళియాపుట్టి మండలం గంగరాజపురం సమీపంలో రాజ్‌యోగి గ్రానైట్ క్వారీలో మంగళవారం సాయంత్రం పిడుగుపడి ముగ్గురు మృత్యువాత పడడం, మరో నలుగురు అస్వస్థతకు గురై టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావును ఆదేశించారు. అనంతరం పిడుగు పాటులో మృతిచెందిన వారి మృతదేహాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. వీరితో పాటు ట్రైనీ కలెక్టర్ పృధ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

ఘటనా స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్పీ

మెళియాపుట్టి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగరాజపురం వద్ద ఉన్న రాజ్‌యోగ్ గ్రానైట్ క్వారీలో పిడుగుపడి ముగ్గురు మృతి చెందగా.. మరో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. ఘటనా స్థలాన్ని ఎస్పీ మహేశ్వరరెడ్డి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాద వివరాలను క్వారీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీంతో దర్యాప్తు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్వారీ యాజమాన్యానికి ఎమ్మెల్యే, ఎస్పీ సూచించారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు, పాతపట్నం ఎస్ఐ సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.



పిడుగు పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్, ఎమ్మెల్యే గొండు శంకర్

ఉపాధి కల్పనే ధ్యేయంగా జాబ్‌మేళాలు

- మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్



శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని మెప్మా మిషన్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్ అన్నారు. బుధవారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో మెప్మా, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా మెగా జాబ్‌మేళా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్ర బాబు నాయుడు నిర్దేశించిన ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త నినాదంతో స్వయం సహాయక సంఘాల మహిళలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆయా కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగితను నిర్మూలించేందుకు ప్రతీ మూడు నెలలకోసారి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి శ్రీనివాసరావు, మెప్మా పీడీ వెంకటరావు, బి.నాగలక్ష్మి, 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు

దైవసేవ అదృష్టంగా భావించాలి

- గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు

గార, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దైవసేవ అదృష్టంగా భావించాలని గోవా గవర్నర్, శ్రీకూర్మ క్షేత్రం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. శ్రీకూర్మనాథ స్వామి దేవస్థానంలో బుధవారం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, ట్రస్ట్ బోర్డు సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. స్వామివారి ఆభరణాలను ఇటీవల తెప్పించి అలంకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ క్షేత్రంలో ఇటీవల తాబేళ్లు మృతిచెందిన ఘటన తనను ఎంతో కలిచి వేసిందన్నారు. విజయనగరం గజపతులు ధర్మకర్తలుగా ఉన్న 150 దేవాలయాల అభివృద్ధికి గాను అన్ని ఆలయాల ట్రస్ట్‌బోర్డు సభ్యులతో త్వర లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విజయగనరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. కూర్మక్షేత్రం అభివృద్ధికి తనవంతు సహకరిస్తానన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఈ క్షేత్రం శ్రీకాకుళం నియోజకవర్గంలో ఉండడం తన అదృష్టమన్నారు. తొలుత పాలకమండలి సభ్యులతో దేవాలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయిం చారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో కె.నరసింహనాయుడు, ప్రధాన అర్చకుడు చామర్ల సీతారామ నర్సింహా చార్యులు, పాలక మండలి సభ్యులు కైబాడి కుసుమ కుమారి, ఆరవెల్లి శ్వేతబిందు, అంద వరపు మనీషా, గొండు శ్రీనివాసరావు, ఇతర సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ప్రసిద్ధ శాలి హుండం బౌద్ధక్షేత్రాన్ని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజుతో పాటు ఇతర నేతలు సందర్శించి అక్కడి చారిత్రక విశేషాలను తిలకించారు.

డేంజర్.. డేంజర్!

(ఐదో పేజీ తరువాయి)

పీడియాట్రిక్ తదితర వార్డుల్లో ఏసీలు తరచుగా పాడైపోతున్నాయి. ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న వైద్య కళాశాల(రిమ్స్)లోని లైబ్రరీలో ఇటీవల జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు, ఏసీలు, సీలింగ్, ఫర్నీచర్ కాలిపోయాయి. వార్డుల్లో అయితే పరిస్థితి చెప్పనవసరం లేదు. నిత్యం ఫ్యాన్లు, లైట్లు పాడైపోతున్నాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేస్తున్నారు. శాశ్వత పరిష్కారానికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

తాత్కాలిక మరమ్మతులతో మరింత ప్రమాదం..

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు కేబుల్ వైర్లను కట్ చేసి, మరలా అతికించి, మట్టితో పూడ్చివేస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది. నిజానికి అండర్ గ్రౌండ్ కేబుల్ వైర్లను ఇన్‌స్టాల్ చేసేటప్పుడే సిల్వర్ రేకులతో కూడిన ట్రెంచ్‌లు వేయాలి. ఆ తరువాత ఒక పొర సీలింగ్ వేస్తారు. ప్రస్తుతం అలా చేయడం లేదు. ఆ క్షణానికి పనిజరిగితే చాలన్నట్లు తూతూమంత్రంగా చేయిస్తున్నారు. వాస్తవానికి ఆస్పత్రిలో 25 మంది ఎలక్ట్రీషియన్లు అవసరం. కానీ, కేవలం ముగ్గురు మాత్రమే సేవలందిస్తున్నారు. దీంతో విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం నెల కుంటుంది. ఐదు రోజుల కిందట రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో సవాయ్ మాన్‌సింగ్ ఆసు పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఏడు గురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. అటు వంటి సంఘటనలు రిమ్స్‌లో జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ కేబుల్ వ్యవస్థకు సంబంధించి శాశ్వత చర్యలు చేపట్టడంతో పాటు ఎలక్ట్రీషియన్లను నియమించాలని రోగులు కోరుతున్నారు.

డబ్బు ఆశచూపి.. స్మగ్లింగ్‌లోకి దించి

(ఐదో పేజీ తరువాయి)

కార్యకలాపాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో జిల్లా గంజాయి, నల్ల మందు వంటి మాదక ద్రవ్యాలకు అడ్డాగా నిలుస్తుంది.

ఒడిశా నుంచి జిల్లాలోకి..

జిల్లాకు ఒడిశా రాష్ట్రంతో అనుబంధం ఎక్కువ. రోడ్డు, రైలు మార్గం ఉంది. ఇదే ఇప్పుడు మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం, విక్రయానికి కారణమవుతోంది. ఒడిశాలోని గజపతి, గంజాం, రాయగడ జిల్లాలకు సంబంధించి అంతర్ రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై కనీస తనిఖీలు లేవు. చెక్ పోస్టులను సైతం అధికారులు ఎత్తేశారు. ప్రత్యేక పోలీసులను విధుల నుంచి తొలగించారు. దీంతో తనిఖీలు మృగ్యమయ్యాయి. గంజాయి ముఠాలు, రవాణాదారులు, ఇష్టారాజ్యంగా జిల్లాలోకి ప్రవేశిస్తున్నారు. స్థానిక యువతతో ఒప్పందం చేసుకుంటున్నారు. వారితోనే గంజాయిని విక్రయిస్తున్నారు. జిల్లాలో ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస, పూండి, నౌపడ, కోటబొమ్మాళి, తిలారు, శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస), పొందూరు, జి.సిగడాం రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇందులో పలాస, శ్రీకాకుళం పెద్దస్టేషన్లు. వాటికి మినహాయించి చిన్నస్టేషన్ల మీదుగా గంజాయిని రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా పాసింజర్ రైళ్ల ద్వారానే గంజాయిని తరలిస్తున్నట్టు సమాచారం.

యువత, విద్యార్థులే టార్గెట్..

యువకులు, విద్యార్థులే గంజాయి ముఠా టార్గెట్. ఇందుకు సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు నడుపుతున్నారు. గంజాయి తాగడాన్ని ఒక ఫ్యాషన్‌గా చెప్పుకొని యువతను ఆకర్షిస్తున్నారు. ఫలానా చోట గంజాయి దొరకుతుందని కోడ్ సంభాషణ ద్వారా చెప్పుకుంటున్నారు. ప్రధానంగా 20 సంవత్సరాల్లోపు ఉన్నవారినే పక్కా ప్రణాళికతో గంజాయికి అలవాటు చేస్తున్నారు. ప్రతిగ్రామంలో అయిదారుగురు యువకులను ఎంపిక చేసుకొని ముగ్గులోకి దించుతున్నారు. మద్యం కంటే తక్కువ ధరకు లభిస్తుండడం, నిషా ఎక్కువగా ఇస్తుండడంతో ఇట్టే అడిక్టవుతున్నారు. ఇంత జరుగుతున్నా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ భారీ స్థాయి బోర్డులను విద్యాసంస్థల వద్ద ఏర్పాటు చేశారు. అంతకు మించి ఎస్ఈబీ ఎటువంటి చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదు. అటు విద్యార్థుల్లో అవగాహన పెంచలేదు. అలాగని గంజాయిని పట్టుకోవడం లేదు. పోలీస్ శాఖే ఎంతోకొంత గంజాయిని పట్టుకుంటుంది.

గంజాయి నివారణకు చర్యలు..

ఇచ్ఛాపురం (ఆంధ్రా)-ఒడిశా పక్కపక్కనే ఉండడంతో ఆ రాష్ట్రం నుంచి వ్యాపారులు గంజాయిని జిల్లాలోకి తీసుకువస్తున్నారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. చెక్‌పోస్టులు, ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్ల వద్ద పోలీస్ నిఘా ఉంచాం. ఆంధ్రా మీదుగా గంజాయి వంటి మాదక ద్రవ్యాలు తరలించకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం.

-చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

సౌకర్యాలు కల్పిస్తాం.. చక్కగా చదువుకోండి

(ఐదో పేజీ తరువాయి)

వంటి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. పరిసరాలు, భోజనశాల ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉండడంతో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌కు తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఒక్కొక్కరికి సబ్బు కొనివ్వాలని ఆదేశించారు. బెంచీలు సరిపోవడం లేదని, దోమతెరలు అందజేయాలని విద్యార్థులు కోరగా వాటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు ఉన్నారు.

పసిడి పరుగులు

(ఐదో పేజీ తరువాయి)

ధరలు పెరిగాయి. కాగా, బంగారం ధరలు పెరుగుతుండడంతో మధ్యతరగతి ప్రజలు వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై మొగ్గుచూపుతున్నారు. ఈ ఆభరణాల కోసం రూ.10వేల నుంచి రూ.20వేలు వరకు పెట్టుబడి పెడితే ఏడాది నుంచి మూడేళ్ల వరకూ అచ్చం బంగారు నగలు వలే ఉంటున్నాయని మహిళలు చెబుతున్నారు. మదుపరులు బంగారంపై పెట్టుబడి పెట్టడం, అంతర్జాతీయ స్థాయిలో బులియన్ మార్కెట్‌లో పెట్టుబడులు పెరగడం మూలంగా గోల్డ్ ధరలు పెరుగుతున్నాయి.

నాగావళిలో బయోమెడికల్

(ఐదో పేజీ తరువాయి)

పరిగణిస్తారు. వీటి నిర్వహణ సరిగా లేకపోతే ప్రజారోగ్యానికి పెను ప్రమాదమే. వీటిని శాస్త్రీయ విధానాల్లో వర్గీకరించాలి. సురక్షితంగా తరలించాలి. తర్వాత శుద్ధి చేయాలి. అలా శుద్ధి చేయడానికి వీల్లేని వ్యర్థాలను భూమి లోపల పాతాలి. కానీ ఈ ప్రక్రియ ఏదీ జరగడం లేదు. చాలా ఆసుపత్రుల్లో వీటిని భద్రపరిచేందుకు గదులు లేవు. ప్రత్యేక విభాగాలు లేవు. దీంతో సూదులు, సిరంజీలు, మాస్కులు, దూది, చేతి తొడుగులు, బ్లడ్ బ్యాగ్‌లు, రక్తపరీక్ష పరికరాలు, కణజాలం, గ్లూకోజ్ బాటిళ్లు, వైర్లు, పీపీఈ కిట్లు వంటి వాటిని కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పడేస్తున్నాయి.

- ఇటీవల శ్రీకాకుళం నగర పరిధిలోని నాగావళి నదిలో స్వచ్ఛోత్సవ్ నిర్వహించారు. కొత్త బ్రిడ్జి సమీపంలోఒక చోట గుట్టగుట్టలుగా ఆసుపత్రి వ్యర్థాలు కనిపించాయి. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాల నిర్వహణను సక్రమంగా చేపట్టని ఆసుపత్రులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. పారిశుధ్య నిర్వహణను పాటించని వారి నుంచి భారీ జరిమానా వసూలు చేయనున్నారు.

ఆసుపత్రులకు నోటీసులు..

వ్యర్థాల కారణంగా నాగావళి నది కలుషితం అవుతుంది. బయోమెడికల్ వ్యర్థాలను విడిచిపెడుతున్న ప్రైవేటు ఆస్పత్రులు యాజమాన్యాలకు స్పష్టమైన నోటీసులు జారీ చేశాం. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు. దీనిపై కాలుష్య నియంత్రణ అధికారులు సైతం దృష్టిపెట్టాలి.

-ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్

రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



బల్లిపుట్టుగలో మాట్లాడుతున్న కలెక్టర్

కవిటి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బల్లిపుట్టుగ గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించి రైతులకు మేలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బల్లిపుట్టుగ గ్రామాన్ని బుధవారం రాత్రి సందర్శించి రైతులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. రీ సర్వే తర్వాత గ్రామంలో 223 మంది రైతులకు చెందిన భూముల వివరాలు నమోదులో లోపాలున్నాయని రైతులు ఇటీవల అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. దీనిపై ఈ నెల ఒకటిన కవిటిలో కలెక్టర్ సమీక్షలో సమస్యలను రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వారం రోజులైనా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై బుధవారం పలాసలో నిర్వహించిన రెవెన్యూ సమీక్ష సమావేశంలో కవిటి తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష సమావేశం నుంచి బల్లిపుట్టుగ గ్రామానికి చేరుకొని రైతుల సమస్యలపై ఆయన చర్చించారు. జాయింట్ ఎల్‌పి నెంబర్లు రావడం లేదని, విస్తీర్ణంలో తేడాలున్నాయని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆన్‌లైన్‌లో సిబ్బంది గ్రామంలో ఉండి సమస్య ఉన్న రైతులకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. రెండు రోజుల్లోగా ఈ పనులు పూర్తి చేసి సమాచారాన్ని తనకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. లేకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్వో వేంకటేశ్వరరావు,స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పద్మావతి, పలాస ఆర్డీవో జి.వెంకటేష్ ఉన్నారు.

అర్ధంతరంగా నిలిచిపోయిన సమీక్ష..

పలాస, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస డివిజన్ రెవెన్యూ సమీక్ష సమావేశం స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో బుధవారం అర్ధంతరంగా నిలిచిపోయిన ఘటన చోటుచేసుకుంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన డివిజన్‌స్థాయిలో పీజీఆర్ఎస్, మ్యుటేషన్, ఎఫ్‌లైన్, రీ సర్వే కోర్టుల్లో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో కవిటి మండలానికి సంబంధించిన ఎల్‌పీ ఎంల సమస్య పరిష్కారంపై కలెక్టర్ అక్కడి తహసీల్దార్ మురళీమోహన్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమావేశాన్ని నిలుపుదల చేసి కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామానికి వెళ్లారు.

రహదారులకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

జర్జంగి-పింద్రువాడ రోడ్డు (ఎస్‌హెచ్-101, 106, 107)కు రూ.2.73 కోట్లు, నౌపడ-మెళియాపుట్టి రహదారి (ఎస్‌హెచ్-90) 13 కిలోమీటర్లకు రూ.6 కోట్లు, పొందూరు-సర్వేశ్వరపురం రోడ్డు ఆరు కి.మీ అభివృద్ధికి రూ.2.40 కోట్లు, తలతంపర-రామయ్యపట్నం రోడ్డు ఐదు కి.మీ పనులకు రూ.2.10 కోట్లు, గరుడ భద్ర-బొడ్డపాడు, అక్కుపల్లి-తోటవూరు రహదారుల (ఎండీఆర్)అభివృద్ధికి రూ. 3.70 కోట్లు కేటాయించారు. మొత్తం 80 కిలో మీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్‌లో సిక్కోలు కళాకారుల ప్రదర్శన

కంచిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మఖరాంపురం గ్రామానికి చెందిన కళాకారులకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో అరుదైన అవకాశం లభించింది. తెల్లాపూర్‌లో నిర్వహించిన దుర్గమ్మ నిమజ్జనోత్సవంలో యువకళాకారులు కాళీమాత వేషధారణలతో అలరించారు. కళాకారుల హావభా వాలతో స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం సికింద్రాబాద్‌లో జరిగిన దుర్గా నవరాత్రి ముగింపు వేడుకల్లో కూడా పాల్గొని ప్రదర్శనలిచ్చారు. కళాకారుల ప్రతిభను మెచ్చుకొని నిర్వాహకులు సత్కరించి అభినందించారు.



కాళీమాత వేషధారణలతో కళాకారులు

దారుణం

తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు పనులకు రూ. 3.5 కోట్లు నాబార్డు నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు చేపట్టలేదు. దీంతో ప్రజలు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. రోడ్డు దారుణంగా ఉండడంతో కనీసం పాదచారులు, వాహనచోదకులు వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-ఎచ్చెర్ల



కొత్తపేట గ్రామ రహదారి దుస్థితి..

శిథిలావస్థ



శిథిలావస్థకు చేరిన పూర్వపు రెవెన్యూ భవనం

గారలోని పాత రెవెన్యూ కార్యాలయం భవనం ఒకటి శిథిలావస్థకు చేరుకుంది. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనంలో రెండేళ్ల కిందటి వరకు కార్యాలయం నిర్వహించారు. కొత్త భవనం కట్టడంతో దీనిని విడిచిపెట్టారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సమీపంలో ఉన్న పశువైద్యశాల, వ్యవసాయశాఖ కార్యాలయాలకు వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని తొలగించి ఆ స్థానంలో కొత్త భవన నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు,

-గార

అధ్వానం

రైల్వే స్టేషన్ రహదారి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో అడుగడుగునా గోతులు ఏర్పడి దారుణంగా ఉంది. వర్షపునీరు గోతుల్లో చేరి నిలిచిపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ మార్గం రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఉండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

-జి.సిగడాం



అధ్వానంగా ఉన్న రైల్వే స్టేషన్ రహదారి

ప్రమాదకరం

పట్టణంలోని ఎర్రన్నాయుడు కూడలి వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు దారుణంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థులు కూడా గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

-ఇచ్ఛాపురం



రోడ్డు మధ్య ఏర్పడిన ఏర్పడ్డ గోతులు

న్యూస్ బాక్స్

150 మందికి వైద్య పరీక్షలు

ఆమదాలవలస, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంకు ఖాతాదారులు, పెన్షనర్లు, సిబ్బంది వివిధ వ్యాధి నిపుణులు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ సుశాంత్‌కుమార్,పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సుర వరపు సిమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, బొడ్డేపల్లి మోహన్‌రావు, హెచ్‌వీ సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బీవీరమణ. సిబ్బంది పాల్గొన్నారు.

50 మందికి కంటి పరీక్షలు..

సోంపేట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం గ్రామంలో బుధవారం 50 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ షీలా తంగరాజన్ కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలకు సిఫారసు చేశారు. గ్రామస్థులతో పాటు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు.

బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో సతివాడ మాజీ సర్పంచ్ మృతి



ప్రభాకరరావు (ఫైల్‌ఫొటో)

గార రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సతివాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగు ప్రభాకరరావు (48) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గౌరీ పౌర్ణమి సందర్భంగా బుధవారం కొత్తవెలంపేట లో తమ బంధువుల ఇంటికి విందు భోజనానికి వెళ్లారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో నిజామా బాద్ గ్రామ సమీపంలో తాను నడుపు తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. వెంటనే స్థానికులు గమనించి వచ్చి చూసేసరికే ప్రాణాలు కోల్పోయారు. వెంటనే అతని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ గంగరాజు తెలిపారు.

రోడ్లన్నీ మురుగుమయం

- దుర్గంధంతో అల్లాడుతున్న జనం
- కాలువ వ్యవస్థలేకే..
- ఇదీ కరజాడ గ్రామంలోని దుస్థితి

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం కరజాడ గ్రామం లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎక్కడ అడుగేస్తే జారిపడి పోతామో తెలియని పరిస్థితి.. కాలువ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు రోజుల తరబడి నిలిచి కనీసం బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఏ వీధి చూసినా ఇటువంటి పరిస్థితే. మురుగునీటితో పాటు ఇటీవల కురిసిన వర్షాల నీరు కలిసి రోడ్లన్నీ దారుణంగా తయారయ్యాయి. గ్రామంలోకి వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరజాడ కాలనీ అమ్మవారి గుడికి అనుకుని ఉన్న కాలువ, ఎదురుగా ఉన్న ఇళ్ల వద్ద పరిస్థితి అధ్వానంగా మారింది. పాతపంచాయతీ భవనం సమీపంలో రోడ్లపైనే నీరు ప్రవహిస్తోంది. మురుగునీరు నిల్వతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దుర్గంధంతో ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనన్న ఆవేదన చెందుతున్నారు. మురుగునీటి నిలువ వల్ల దోమలు ఉత్పత్తి చెంది జ్వరాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కరజాడ కాలనీ అమ్మవారి ఆలయం వద్ద పేరుకుపోయిన మురుగు



గ్రామంలో ఇళ్ల ఎదుట దారుణంగా ఉన్న దృశ్యం

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు చివరితేదీ నేడు

గుజరాతీపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా.కె. శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతం, ఒరియా సబ్జెక్టులకు గాను సంబంధిత సబ్జెక్టులలో పీజీతోపాటు పీహెచ్‌డీ, నెట్, స్లెట్, ఏపీ సెట్ అర్హతలున్న అభ్యర్థులు అర్హులన్నారు. దరఖాస్తులను గురువారం లోగా కళాశాలలో సమర్పించాలని, ఈనెల 10వ తేదీన ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూ ఇదే కళా శాలలో ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని కోరారు.

రేపు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సీఈవో డి. సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి జడ్పీ సమావేశ మందిరంలో జరుగు సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆదిత్యుని సేవలో మెప్మా డైరెక్టర్..



మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్‌కు జ్ఞాపికను అందిస్తున్న అర్చకులు

అరసవల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ (ఐఏఎస్) బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, మాధవశర్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడియత్నం దురదృష్టకరం



నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ నేతలు

కవిటి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే జస్టిస్ గవాయ్‌పై దాడి చేసేందుకు యత్నించడం దురదృష్టకరమని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం కవిటి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జస్టిస్‌పై దాడికి యత్నం రాజ్యాంగంపై దాడి గానే భావించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

వాడవాడలా నందెన్న సంబరాలు



రొట్టవలసలో పులివేషాలతో కళాకారులు

సరుబుజ్జిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గౌరీపౌర్ణమి సందర్భంగా పలు గ్రామాల్లో నందెన్న సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి మట్టితో తయారు చేసిన శివపార్వతులతో కూడిన నందెన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు గ్రామంలో తిరువీధి నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పౌర్ణమి నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ వివిధ వేషధారణలతో కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నారు. నందెన్న సంబరాల వేడుకల్లో భాగంగా బుధవారం రొట్టవలసలో కళా కారులు పులివేషాల ప్రదర్శన చేసి గ్రామస్థులను ఆకట్టుకున్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, పబ్లిక్ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై చట్టపరంగా చర్యలతో పాటు జైలు శిక్ష తప్పదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం మత్తులో రోడ్డుపై వీరంగం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన నగరానికి తమిరి సాయికి సెకెండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి 45 రోజులు జైలుశిక్ష విధించారన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు.

పట్టణంలో భారీ వర్షం



ఇచ్ఛాపురంలో కురుస్తున్న వర్షం



నందిగాంలో పడుతున్న వర్షం

ఇచ్ఛాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మధ్యాహ్నం సుమారు గంటపాటు భారీ వర్షం పడింది. కాలువలు నిండి రోడ్లపై మురుగునీరు పారింది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- నందిగాం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం బుధవారం మధ్యాహ్నం కురిసింది. ఉరుములు, మెరుపులు ప్రజలకు భయభ్రాంతులకు గురి చేయగా ఏకధాటిగా సుమారు గంటపాటు వర్షం కురిసింది.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

రణస్థలం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పారిశ్రామికవాడలోని శ్రేయాన్ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని చిట్టివలసకి చెందిన పలువురు యువకులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పరిశ్రమ ఎదుట నిరసన తెలిపారు. ఉదయం పరిశ్రమలోకి కార్మికులు, ఉద్యోగులను వెళ్లకుండా వీరంతా అడ్డుకున్నారు. సుమారు 2 గంటల పాటు నిరసన వ్యక్తంచేశారు. తదుపరి పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అక్కడికి చేరుకుని పరిశ్రమ యాజమాన్యం, చిట్టివలస యువకులతో చర్చించడంతో సమస్య సద్దుమణిగింది.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలో సోంపేట, జింకిభద్ర, బెంకిలి తదితర గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బొరివంక సబ్ స్టేషన్ పరిధిలో..

కవిటి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకట నలో తెలిపారు. బొరివంక, మాణిక్యపురం ఫీడర్లలో ఆర్‌డీ ఎస్ఎస్ పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. బొరివంక, దూగాన పుట్టుగ, మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, వరక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

ఉర్లాం సబ్ స్టేషన్ పరిధిలో..

నరసన్నపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు గమనించాలని కోరారు.

విజేతలకు బహుమతి ప్రదానం

ఇచ్ఛాపురం, అక్టోబరు 8(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో విద్యార్థులకు జీఎస్టీపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలకు ప్రిన్సి పాల్ చింతాడ శరత్‌బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్ సురేష్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో మహిళ మృతి

కంచిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాలిన పుట్టుగ గ్రామానికి చెందిన సప్ప గోపమ్మ(48) కిడ్నీ వ్యాధితో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంత కాలంగా ఈమె కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు.



గోపమ్మ (ఫైల్)

బెంబేలెత్తిస్తున్న శునకాలు

- రహదారులపై గుంపులుగా సంచారం
- ద్విచక్ర వాహనాల వెంటపడి దాడులు
- గాయాలతో ఆసుపత్రిపాలవుతున్న ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


నరసన్నపేట: మారుతీనగర్‌లో కుక్కల సంచారం

నరసన్నపేట/ పలాస/ పొందూరు/ లావేరు/ గార రూరల్/ జలుమూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా శునకాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను, వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా శునకాలు దాడి చేసి గాయపరుస్తుండడంతో బాధితులు ఆసుపత్రి పాలవుతున్నారు. ఒక్కో సమయంలో వాహనాలను వెంబడిస్తూ వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. నరసన్నపేట మండలం కరగాం గ్రామానికి చెందిన ఒక మహిళపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఆమె కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. సారవకోట మండలంలోని ఒక గ్రామానికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వస్తుండగా జమ్ము జంక్షన్ సమీపాన కృష్ణానగర్ వద్ద కుక్కలు వెంబడించాయి. దీంతో వాహనదారుడు భయపడి వాహనం అదుపు తప్పి పడిపోడంతో వారిద్దరూ గాయపడ్డారు. పొందూరు మండలం దళ్లవలస సచివాలయ కార్యదర్శి పి.జగదీష్‌పై కుక్కలు ఒక్కసారి దాడి చేసి వాహనానికి అడ్డుగా రావడంతో పడిపోయి రెండు చేతులు విరిగిపోయాయి. లావేరు మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. హైవేపై సైతం శునకాలు వాహనాలను వెంబడిస్తుండడంతో వాటిని తప్పించుకునేందుకు వారు అతివేగంతో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. గార మండలంలోని పలు గ్రామాల్లోనూ శునకాలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కళింగపట్నం-పార్వతీపురం, గార-చింతాడ జాతీయ రహదారికి పక్క ఉన్న గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. జలుమూరు మండలంలో చల్లవానిపేట కూడలి, కొమనాపల్లి కూడలి, శ్రీముఖలింగం తదితర ప్రాంతాల్లో కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలు ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోనూ కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా వెళ్తూ ఒంటరిగా కనిపించేవారిపై దాడి చేస్తున్నాయి. జంట పట్టణాల్లో వెయ్యికి పైగా వీధి కుక్కలు సంచరిస్తున్నట్టు అంచనా. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు గళమెత్తినా ఫలితం లేకపోతుంది. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, కోటబొమ్మాళి, పాతపట్నం, ఆమదావలస, సోంపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపై కూడా కుక్కలు దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. గత మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా కొన్ని వందల మంది కుక్కకాటు బాధితులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.


పొందూరు: రాపాక రోడ్డుపై సంచరిస్తున్న శునకాలు

బతుకుదెరువు కోసం వెళ్లి..

- దుబాయ్‌లో జిల్లా యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి
- పాలవలసలో విషాదం


ఓంకార్ (ఫైల్)

సోంపేట రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బతుకుతెరువు కోసం దుబాయ్ వెళ్లిన పాలవలస గ్రామానికి చెందిన తామాడ ఓంకార్ (21) అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తల్లి నీలవేణి, చిన్నాన్న సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలో వెల్డింగ్ పనులు చేసుకుంటూ తల్లిని పోషించుకుంటున్న ఓంకార్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ఉపాధి కోసం ఆరు నెలల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండేవాడు. అయితే నాలుగు రోజులుగా అతడి నుంచి ఫోన్ రాకపోవడంతో గ్రామస్థులు తోటి కార్మికులను సంప్రదించారు. ఈ నెల 3న ఓంకార్ మృతి చెందినట్టు వారు సమాచారమిచ్చారు. మృతికి కారణాలు వారి నుంచి స్పష్టంగా తెలియలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఐదేళ్ల కిందట మృతి చెందాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని ఎమ్మెల్యే అశోక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ ద్వారా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు ఫ్యాక్స్‌లో బుధవారం వేడుకున్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి మృతదేహం రప్పించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చినట్లు ఎంపీటీసీ మాజీ సభ్యులు చెల్లూరు ధర్మ, నాయకులు మన్మథరావు, రామదాసు తెలిపారు. కుమారుడి మృతితో ఆ తల్లి ఆవేదన వర్ణణాతీతం. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

క్రీడా పోటీలకు వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎచ్చెర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట పంచాయతీ కొయ్యారాళ్ల జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. శ్రీకాకుళం నగరంలో జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా వంగర మండలం సంగాం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులను ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బైక్‌పై తీసుకువస్తూ ఫరీద్‌పేట గ్రామానికి చెందిన మరో బైక్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో అక్కచెల్లెళ్లు అయిన విద్యార్థినులు జి.మణి (9వ తరగతి), జి.ఇందు (8వ తరగతి)తో పాటు ఫరీద్‌పేటకు చెందిన ఓ వ్యక్తి గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తికి గాయాలు

టెక్కలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్ఎం రోడ్డు పరిధి పాత జిల్లా ఆసుపత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పట్టణానికి చెందిన జి.కృష్ణకుమార్ ద్విచక్రవాహనంపై వస్తూ బోల్తా పడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తుంది.

గంజాయితో స్మగ్లర్ అరెస్టు

- నిందితుడిది కర్ణాటక రాష్ట్రం


మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

పలాస, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో కర్ణాటక రాష్ట్రం జోకటి గ్రామానికి చెందిన షాకత్ ఆలీ అనే గంజాయి స్మగ్లర్ మంగళవారం రాత్రి పట్టుబడినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వివరిం చారు. బరంపూర్ (ఒడిశా)కు చెందిన అజయ్‌కుమార్ బెహరా నుంచి షాకత్ ఆలీ కిలో రూ.5వేలు మూడు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దీనిని కర్ణాట కలో ఉన్న మహ్మద్ పర్వేజ్‌కు విక్రయించేందుకు మంగళవారం రాత్రి వస్తుండగా కాశీబుగ్గ ఎస్ఐ జి.నర్సింహమూర్తికి పట్టుబడ్డాడు. దీంతో అతడి నుంచి గంజాయితోపాటు మొబైల్‌ఫోన్, రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడ్ని పలాస కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్

పాతపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో ఇద్దరికి కోర్టు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శాంతినగర్‌కు చెందిన చెల్లి శ్రీనివాసరావుకు మండల పరిధిలోని చిన్నపద్మాపురం గ్రామానికి చెందిన బాడాన వెంకటరావు, సారవకోట మండల పరిధిలోని గోవర్ధనపురం గ్రామానికి చెందిన జోగి రమేష్ ఓ ల్యాండ్‌కు సంబంధించి తప్పుడు పత్రాలను సృష్టించిన అమ్మజూపారు. ఇందులో భాగంగా శ్రీనివాసరావు నుంచి కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మోసపోయినట్టు తెలుసుకున్న శ్రీనివాసరావు తన డబ్బులు ఇవ్వాలని వారిని అడిగాడు. వారిద్దరూ తమ స్నేహితుడైన టెక్కలి మండలం లింగాలవలస గ్రామానికి చెందిన యడ్ల గోపితోపాటు మరికొంత మందితో శ్రీనివాసరావును బెదిరించారు. శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితులు బాడాన వెంకటరావు, జోగి రమేష్‌లను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం హాజరుపరచగా.. 14రోజులు రిమాండ్‌ను విధించినట్టు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

ఆరు గేదెలు పట్టివేత

కోటబొమ్మాళి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి జర్జంగి గ్రామ సమీపంలో బుధవారం ఓ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఆరు గేదెలను పట్టుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ వి.సత్యన్నారాయణ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా పశువులు తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు స్థానిక పోలీసులు జర్జంగి గ్రామ సమీపంలో వ్యాన్‌ను పట్టుకొని తనిఖీలు చేయగా అక్రమంగా ఆరు గేదెలు తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో కంచిలి మండలం బురగాం గ్రామానికి చెందిన మద్దు హరికృష్ణ, గేదెల కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. మంగళవారం కంచిలి సంతలో ఆరు గేదెలు కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు తెలిపారు. గడిచిన మూడేళ్లుగా వేర్వేరు ప్రాంతాల్లో పశువులు కొనేగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నామని, మాపై కంచిలి, కాశీబుగ్గ, నరసన్నపేట, బారువ, ఇచ్ఛాపురం పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయని వారు తెలిపినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు వారి ఇరువురుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

టెక్కలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక కొత్త ప్రయాణం విద్యార్థి దశ నుంచే ప్రారంభమవుతుంది. అందుకే ప్రతి విద్యార్థి లక్ష్యాల వైపు అడుగులు వేయాలని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, లక్ష్మీశ్రీకాంత్, డాక్టర్ విష్ణుమూర్తి, శివకుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వద్దు

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు

హరిపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోనసీమను తలదన్నే పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టవద్దని మాజీ మంత్రి, రైతు సంఘం నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మందస మండలం ఎం.గంగువాడ గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు ఎంతో ఘనమైన పోరాట చరిత్ర ఉందని, ఉద్యమాల పురిటి గడ్డగా పేరుందని గుర్తు చేశారు. ఎయిర్‌పోర్టు పేరుతో బలవంతపు భూసేకరణ చేపడితే అంతే స్థాయిలో ప్రజలనుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ పచ్చని ఉద్దానంలో ఎయిర్‌పోర్టు పేరుతో సీఎం చంద్రబాబు, జీఎంఆర్ సంస్థ వారు వందలాది ఎకరాల భూములు తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అండగా తామంతా ఉంటామని అన్నారు. కార్యక్రమం సమన్వయకర్త మహదేవ్ మాట్లాడుతూ రైతుల ఆమోదం లేకుండా సెంటు భూమి కూడా తీసుకునే హక్కు ప్రభుత్వానికి లేదని, ఐదు లక్షల ఉద్యోగాలు వస్తాయని కేంద్ర మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తాండ్ర ప్రకాష్, సీపీఎం నాయకులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు రామారావు, వంకల మాధవరావు, పోతనపల్లి కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

టెక్కలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన టెక్కలిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీటీ లక్ష్మీనారాయణకు విశ్రాంతి ఉద్యోగుల సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లాను రెండుగా విభజిస్తున్న నేపథ్యంలో టెక్కలిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి కె.ధనుంజయరావు కోరారు. తీర, అటవీ, మైదాన ప్రాంతాలు, పారిశ్రామికరంగ అభివృద్ధికి ఎంతగానో అవకాశాలు ఉన్నాయన్నారు. జీవీ రెడ్డి, అయ్యబాబు, దివ్వల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

సంతబొమ్మాళి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బోరుభద్రలో పారిశుధ్య పనులను టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ బుధ వారం పరిశీలించారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు బోరు భద్రలో పర్యటించగా.. కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో తామంతా ఇబ్బంది పడుతున్నట్టు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు యుద్ధప్రాతి పదికన పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం నుంచి పారిశుధ్య పనులు చేపట్టి కాలువల్లో పేరుపోయిన చెత్త చెదారం తొలిగిస్తున్నారు. ఈ పనులు డీఎల్‌పీవో రమణ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరాలయంలో ఆకాశ దీపం ఏర్పాటు


ఆకాశదీపం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జలుమూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం ఆకాశదీపాన్ని అర్చకులు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి రాజు పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిశా సంప్రదాయం ప్రకారం ఆశ్వీయుజమాసం బహుళ పాఢ్యమి సందర్భంగా ఆలయంలో ఆకాశదీపం ప్రారంభించారు. ఒడిశా ఆచారం, సంప్రదాయం ప్రకారం ఆశ్వీయుజ మాసం బహుళ పాఢ్యమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు కార్తీకమాసం పాటిస్తారు. ఒడిశా సంప్రదాయ ప్రకారం పాఢ్యమి దినాన ఆలయంలో ఆకాశదీపం ఏర్పాటుచేసి నెల రోజులు పాటు వెలిగిస్తామని అర్చకులు నారాయణమూర్తి తెలిపారు. శ్రీముఖలింగేశ్వరాలయం ప్రారంభం నుంచి ఒడిశా ఆచార సంప్రదాయాలు పాటిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటాచలం, సింహాచలం, అచ్యుత, అప్పారావు, శ్రీకృష్ణ, శివ, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

ఎల్ఎన్ పేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బొర్రంపేట గ్రామ సమీపంలోని జంబాడ సమీపంలోని కడగండి రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన ఇరపాక సతీష్(25) బుధవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సతీష్ స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం. జంబాడ గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన కె.లక్ష్మీనారాయణ, పి.సతీష్‌తో కలిసి మృతుడు సతీష్ బుధవారం రిజర్వాయరులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రిజర్వాయరులో దిగి చేపలు పడుతుండగా కల్వర్టులో సతీష్ ఇరుక్కుపోయాడు. దీన్ని గమనించిన మిగిలిన ఇద్దరు అతడిని ఒడ్డుకు తీసుకొచ్చి ఎల్ఎన్ పేట పీహెచ్‌సీకి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

బెండి రోడ్డు పనులు పునః ప్రారంభం


రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లగా నిలిచిపోయిన వజ్రపుకొత్తూరు- బెండి ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో పనులు ప్రారంభించినా బిల్లులు అందకపోవడంతో అర్థంతరగా నిలిచిపోయాయి. దీంతో రోడ్డుపై రాకపోకలు చేయలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వంకు ప్రజలు వివిద సంఘాలు రోడ్డు సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గౌతు శిరీష ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు కేటాయించేలా కృషి చేశారు. దీంతో నిధులు మంజూరు కావడంతో రోడ్డుపనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

బాలికా దినోత్సవం నిర్వహణకు నిధులు

నరసన్నపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సచివాలయాల పరిధిలో వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఒక్కొక్క సచివాలయానికి రూ.260లు చొప్పున సంబంధిత అధికారులు నిధులు విడుదల చేశారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో సంబంధిత శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ

నరసన్నపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిక్కాలవలస గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ 2.0 ద్వారా పన్నులు తగ్గి పేదలకు, మధ్య తరగతి వర్గాలకు నిత్యావసర వస్తువులతో పాటు అనేక ఔషధల ధరలు అందుబాటులో వచ్చాయని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వా ప్రజాసంక్షేమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సర్పంచ్ ముంజు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

నందిగాం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు గురు, శుక్రవారాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమార్ పట్నాయక్ తెలిపారు. డీపీఆర్‌సీ ఆర్‌జీఎస్‌ఏఏపీ 2025-26కు సంబంధించి స్వచ్ఛంద నిధులు సమీకరణపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే శిక్షణకు విధిగా హాజరు కావాలని కోరారు.

- పలాసరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస మండల పరిషత్ కార్యా లయంలో ఈ నెల 9, 10వ తేదీన ఉదయం 10గంటల నుంచి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు ఆర్‌జీఎస్, ఏపీపీ కార్యాచరణ ప్రణాళిక-2025-26 సంవత్సరానికి గాను శిక్షణ ఇవ్వనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో వివిధ ప్రణాళికలపై, పంచాయతీ అభివృద్ధి అంశాలపై శిక్షణ, కార్యాచరణ అంశాలపై వివరించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శిక్షణకు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

పలాసరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస మండలం రేగులపాడు గ్రామ రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజులుగా భారీ వర్షాల ధాటికి రోడ్డంతా గోతులమయం కావడంతో వాహనచోదకులకు ఆ రహదారిలో ప్రయాణం కష్టంగా మారింది. టెక్కలిపట్నం నుంచి రేగులపాడుకు వెళ్లే దారిలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రేగులపాడు ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వద్ద రోడ్డును మరమ్మతులు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కబడ్డీలో ప్రతిభ చాటిన విద్యార్థిని

పలాసరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డొక్కరి వర్షిణి రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ విభాగంలో ప్రతిభ చాటింది. పీఈటీ ప్రేమ్‌చంద్ శిక్షణలో జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీలో బుధవారం ఆమె ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం ఉప్పాడ రమేష్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, యువజన సంఘ ప్రతినిధులు ఆమెను అభినందించారు.

పలాసలో పిడుగు పాటు.. తప్పిన ప్రమాదం


పాడైపోయిన పరికరాలు

కాశీబుగ్గ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలో గల బుధవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతోపాటు కాశీబుగ్గ ఆర్టీఏ కార్యాలయంపై పిడుగు పడింది. ఇదే సమయంలో కార్యాయలంలో సిబ్బంది పని ముగించుకొని భోజనం చేస్తుండగా పిడుగు పడడంతో బయటకు పరుగులు తీశారు. పిడుగుపాటుకు కార్యాలయంలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైటింగ్ అరెస్టర్ తదితర వస్తువులు కాలిపోయాయి. సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడం ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పిడుగులతో కూడిన వర్షం పడింది. పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళన చెందారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

వజ్రపుకొత్తూరు. అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో గురువారం నాటికి వాయిదా వేసినట్టు ఎంపీడీవో ఎన్ రమేష్‌నాయుడు చెప్పారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా.. కనీసం ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాల్సి ఉండగా ఇదుగురు మాత్రమే హాజరు కావడంతో కోరం చాలక ఈ సమావేశాన్ని గురువారం నాటికి వాయిదా వేసినట్టు ఎంపీడీవో ప్రకటించారు.

రైల్వే గేట్‌ను ఢీకొన్న బస్సు


హైటెన్షన్ వైర్లపై పడిన రైల్వే గేట్

కాశీబుగ్గ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేట్‌ను బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో గేటు విరిగిపోయింది. విరిగిన గేట్ పక్కనే ఉన్న హైటెన్షన్ వైర్లపై పడడంతో సమీపంలో ఉన్నవారంతా వాహనాలు విడిచి పెట్టి పరుగులు తీశారు. స్థానిక గేట్‌మన్ రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని గేటుకు మరమ్మతులు చేసి సరి చేశారు. విశాఖ నుంచి పలాస వైపు వస్తున్న ప్రైవేట్ బస్సు గేటును ఢీకొని ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో గంట పాటు వాహనాలకు రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

బాధితుడికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వడ్డివాడ గ్రామానికి చెందిన ఇప్పిలి దీపికకు ఇదే మండలం వల్లేవలస మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రూ.10 వేలు సాయాన్ని బుధవారం అందించారు. టెక్కలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు ఇరిగిపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని గ్రామానికి చెందిన మెండ రామినాయుడు మనబడి అసోసియేషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు.

తాగునీటికి ఇక్కట్లు

టెక్కలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏడాదిగా టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయ సమీపంలో బోరు పనిచేయడం లేదని, దీంతో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని ఆ ప్రాంత మహిళలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత తాగునీటి ఇక్కట్లు కోసం గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందన కరువైందని స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజు తెలిపారు. బోరు మరమ్మత్తు చేసి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

టెక్కలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 2019 నుంచి 2024 వరకు వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని సోషల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి సీహెచ్ మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం టెక్కలిలో లబ్దిదారుల అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదని, ఎవరైనా ఇల్లు లేకపోతే సొంతింటి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజనా పథకం నెలకొల్పిందని, వీటికి బ్యాంకులు సైతం రుణాలు ఇస్తున్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సూర్యాఘర్ ఏర్పాటుచేస్తే విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఆయన తెలిపారు.

వసప కేజీబీవీ ప్రిన్సిపాల్, అకౌంటెంట్ తొలగింపు

కొత్తూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వసప కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ రాధిక, అకౌంటెంట్ శ్రీదేవిలను విధులు నుంచి తొలగిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఏపీసీ ఎస్.శశిభూషణ్ ఉత్తుర్వులు జారీ చేశారు. దసరా సెలవులు ముందు కేజీబీవీలో బియ్యం నిల్వలపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ కె.బాలకృష్ణ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 1400 కిలోల బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్టు గుర్తించారు. 25 కిలోల చొప్పున గల మొత్తం 46బస్తాలు పట్టుకున్నారు. దీన్నిపై సమగ్రంగా తహసీల్దార్ నివేదికను ఏపీసీకి ఇవ్వడం జరిగింది. అవీనీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఇద్దరిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ ఉత్తుర్వులు గత నెల 26న వచ్చినప్పటికీ అధికారులు బయట పెట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు అధికారులు తొలగింపుపై కేజీబీవీ సిబ్బందిలో ఆందోళన నెలకొంది.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

నందిగాం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్య బోధనకు అవసరమైన పాఠ్యపుస్తకాలు బుధవారం ఎంఆర్‌సీకి చేరాయి. యూపీ, ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఆరు నుంచి పదో తరగతులకు చెందిన విద్యార్థులకు వీటిని అందించనున్నారు.

- నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను అందజేయడం జరుగుతుందని ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. బుధవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.
- వజ్రపుకొత్తూరు: వివిధ ప్రభుత్వ పాఠశాలకు రెండో సెమిస్టర్ సంబంధించి 20,053 పుస్తకాలు వచ్చినట్టు ఎంఈవో వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం నుంచి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.